# దీక్షా దివస్‌ను సక్సెస్ చేద్దాం

- కేసీఆర్ వల్లే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించింది
- ఉద్యమ చరిత్రను భావితరాలకు చెప్పాలి
- పండుగ వాతావరణంలో నిర్వహిద్దాం..
- కంటోన్మెంట్ సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల పిలుపు

కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకురాలు నివేదిత

కంటోన్మెంట్, నవంబర్ 28: పండుగ వాతావరణంలో దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కంటోన్మెంట్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. సీనియర్ నాయకురాలు నివేదిత మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ నేత కేసీఆర్ తలపెట్టిన దీక్షతో యావత్ దేశం కదిలి.. ప్రజల కల సాకారమైందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన సాహసంతో సాధించిన విజయాన్ని, ఉద్యమ చరిత్రను భావితరాలకు తెలియజెప్పాలని పేర్కొన్నారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అన్న నినాదంతో చేపట్టిన ఆమరణ దీక్షతో కేసీఆర్ దేశ రాజకీయాలను కదిలించారన్నారు. తెలంగాణ సాధించిన అనంతరం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అటు అభివృద్ధి, ఇటు సంక్షేమ పరంగా రాష్ట్రాన్ని దేశానికి దిక్సూచిగా మార్చిన మహోన్నత నేత కేసీఆర్ అన్నారు. నేడు మధ్యాహ్నం కంటోన్మెంట్ దోబీఘాట్ నుంచి తెలంగాణ భవన్ వరకు భారీ ర్యాలీగా వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు లోక్‌నాథం, అనితాప్రభాకర్, నళినికిరణ్, మోండా డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, మార్కెట్ మాజీ డైరెక్టర్లు మహంకాళి శర్విన్, దేవులపల్లి శ్రీనివాస్, ఉద్యమకారులు పెంట శ్రీహరి, సృజన్ బీఆర్ఎస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## కేసీఆర్ త్యాగ ఫలితమే ప్రత్యేక రాష్ట్రం

త్యాగాల పునాదులపై బీఆర్ఎస్ జెండా ఎగిరిందని, కేసీఆర్ చేసిన త్యాగ ఫలితంతోనే రాష్ట్రం సిద్ధించిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అన్నారు. పార్టీ పుట్టినప్పటినుంచి ఎంతో మంది వచ్చారు ఎంతో మంది వెళ్లారు. కార్యకర్తలు జెండాలు మోస్తూనే ఉన్నారు. అందరికీ అవకాశాలు రావు వచ్చిన వాళ్లు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ ఘనవిజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వానికి ఎప్పుడు బాసటగా ఉంటారని ఆ పరిస్థితి మళ్లీ రాబోతుందన్నారు.

**– టీఎన్ శ్రీనివాస్, మాజీ చైర్మన్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ**

## సీఎం రేవంత్‌రెడ్డిది నియంత పాలన

రాష్ట్రంలో రేవంత్ నియంత పాలన సాగుతున్నది. ఏక ఛత్రాధిపత్యంలా ఉన్నది. నోరు తెరిస్తే బూతులు మాట్లాడుతున్నాడు. ప్రతిపక్షాలపై నిందలు మోపడమే కాకుండా ప్రజలను పక్కదారి పట్టించేలా రాజకీయం చేస్తున్నాడు. సంక్షేమం, అభివృద్ధిని మరచిన రేవంత్‌రెడ్డి ఒక్క హామీని అమలుచేయలేదు. ఆనాడు వేలాది విద్యార్థులు చనిపోతే బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి, ఈ రోజు తెలంగాణ ఇచ్చింది.. సోనియమ్మ అని.. ఆమె కాళ్లు కడిగి నెత్తిన పోసుకోవాలని సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడు. 14 ఏళ్లు పోరాటం చేసి తెలంగాణ తెచ్చిన మహనీయుడు కేసీఆర్. ఉద్యమ చరిత్రలో కేసీఆర్ పోరాటం, ఆయన దీక్ష చెరగని ముద్ర వేసిందని ఆ దీక్షను మరోసారి మననం చేసుకుందాం. అధికారం కోల్పోయిన నియోజకవర్గాల్లో ఉండే కార్యకర్తలు పార్టీ కోసం పనిచేస్తూ ఎంతో బాధను అనుభవిస్తున్నారని.. వారం దరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చిన్న మెసేజ్ పెట్టినా.. వాట్సాప్‌లో అభిప్రాయం చెప్పినా భరించలేని కాంగ్రెస్ నాయకులు వారిపై కేసులు పెట్టి సామాన్యులను జైలుపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నారని, అలాంటి వారిని కాపాడుకుంటామన్నారు.

**– మన్నె క్రిషాంక్, మాజీ చైర్మన్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ**

## దీక్ష చేయకుంటే తెలంగాణ వచ్చేదా?

మలిదశ పోరాటానికి కేసీఆర్ చేపట్టిన దీక్ష కారణమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దీక్షకు పూనుకున్నారని, దీంతో కేంద్రం దిగివచ్చి ప్రత్యేక రాష్ట్ర ప్రకటన చేసిందని గుర్తుచేశారు. ఆ తర్వాత కేసీఆర్ దీక్ష విరమించారని గుర్తుచేశారు. తెలంగాణ సాధన కోసం చేసిన దీక్ష చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ త్యాగాన్ని గుర్తు చేసుకునేందుకే పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

**– జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు, కంటోన్మెంట్ బోర్డు**

## ఉద్యమంలో కంటోన్మెంట్‌ది ప్రత్యేక పాత్ర

నాడు ఉద్యమానికి కేంద్ర బిందువుగా కంటోన్మెంట్ నిలిచిందని, స్వరాష్ట్ర సాధనలో ప్రత్యేక పాత్ర పోషించింది. నాటి ఉద్యమ సహచరుల కృషి మరవలేనిది. మలిదశ ఉద్యమానికి మలుపు, స్వరాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరులూదినది కేసీఆర్ దీక్షనే. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' నినాదంతో ప్రాణాలను సైతం లెక చేయకుండా ఉద్యమనాయకుడు కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ సాధనే లక్ష్యంగా పోరాడి స్వరాష్ట్రాన్ని సాధించారు. అమరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలు, తెలంగాణ ప్రజల తెగువ, స్వరాష్ట్ర కాంక్షే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు కారణమైంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించి కార్పొరేట్‌కు దీటుగా ఆసుపత్రులు, విద్యాలయాలను అభివృద్ధి చేశారు. నేడు కంటోన్మెంట్ నుంచి తెలంగాణ భవన్ వరకు సుమారు 300 వాహనాలతో భారీగా దీక్షా దివస్‌కు తరలివెళ్లనున్నాం.

**– గజ్జెల నాగేశ్, మాజీ చైర్మన్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్**

### ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 28: ఓయూ పరిధిలోని ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సంవత్సరం (పార్ట్-2) రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 11వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### బీఫార్మసీ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 28: ఓయూ పరిధిలోని బీఫార్మసీ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) మొదటి, రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరో సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### సనత్‌నగర్ పాఠశాలలో చోరీ

అమీర్‌పేట్, నవంబర్ 28: సనత్‌నగర్ అశోక్‌కాలనీ ప్రభుత్వ పాఠశాలలో దొంగతనం జరిగింది. బుధవారం అర్ధరాత్రి జరిగినట్టుగా భావిస్తున్న ఈ ఘటనలో అగంతకులు గేటు నుంచి లోపలికి జొరబడి, రెండు గదుల తాళాలు పగులగొట్టారు. కీలకమైన కంప్యూటర్ ల్యాబ్ తలుపులు బద్దలు కొట్టేందుకు ప్రయత్నించారు. స్కూల్ ఆవరణలోని సీసీ కెమెరాలు సీసీ కెమెరాలతోపాటు విద్యుత్ ఫ్యూజ్ బాక్సును ధ్వంసం చేశారు. గురువారం ఉదయం పాఠశాలకు వచ్చిన తరువాత దొంగతనం జరిగిన విషయం తెలుసుకున్న హెచ్ఎం సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సనత్‌నగర్ పోలీసులతో పాటు క్లూస్ టీమ్ కూడా పాఠశాలను సందర్శించి వేలి ముద్రలు, ఇతరత్రా ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తన కూతురు పెండ్లికి రావాలని మాజీ సీఎం కేసీఆర్‌ను బీఆర్ఎస్ నాయకుడు తలసాని మహేశ్‌యాదవ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆయనతో పాటు తలసాని సాయికిరణ్‌యాదవ్, మీష్‌యాదవ్ ఉన్నారు. – బన్సీలాల్‌పేట్

## నాటి ఆమరణ దీక్షతోనే నేటి ప్రత్యేక రాష్ట్రం

సమావేశమైన బీఆర్ఎస్ అమీర్‌పేట్ డివిజన్ నాయకులు

అమీర్‌పేట్, నవంబర్ 28: ఉద్యమనేత కేసీఆర్ నాటి ఆమరణ దీక్షతోనే నేటి ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని అమీర్‌పేట్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.హనుమంతరావు, సంతోష్ మణికుమార్ పేర్కొన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్ష రాష్ట్ర సాధనకు ఢిల్లీ స్థాయిలో నెలకొన్న అడ్డంకులను పటాపంచలు చేసిందని చెప్పారు. ప్రస్తుతం పరుగులు పెడుతున్న తెలంగాణ అభివృద్ధికి, నాడు కేసీఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి చేపట్టిన దీక్షే నాంది అని వివరించారు. రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేసిన నాటి దీక్షను గుర్తు చేసుకుంటూ బీఆర్ఎస్ శ్రేణులు అంగరంగ వైభవంగా జరుపుకునే దీక్షా దివస్‌ను శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న దృష్ట్యా, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో ర్యాలీగా తరలిరావాలని వారు సూచించారు. సన్నాహక సమావేశానికి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్‌యాదవ్, కూతురు నర్సింహ, ఉత్తమ్‌సింగ్, వినోద్‌కుమార్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ నేత కేసీఆర్ దీక్ష చరిత్రాత్మకం

చిక్కడపల్లి, నవంబర్ 28: రాష్ట్ర సాధన భాగంలో కేసీఆర్ నిర్వహించిన ఆమరణ దీక్ష ద్వారా ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. గురువారం ఆయన గాంధీనగర్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం నిర్వహిస్తున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ నేతృత్వంలో రాంనగర్‌లోని అమరవీరుల స్థూపం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తెలంగాణ భవన్‌కు చేరుకోన్నుట్టు తెలిపారు.

### లష్కర్‌లో తల్లి కూతుళ్ల అదృశ్యం

బేగంపేట్, నవంబర్ 28: సికింద్రాబాద్ జనరల్ బజార్‌లో తల్లీ కూతుళ్లు అదృశ్యమైన సంఘటన మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. బెంగాల్ రాష్ట్రానికి చెందిన స్వరూప్‌దాస్ తన భార్య కూతురుతో కలిసి నగరానికి వచ్చి కళాసీగూడలో ఉంటున్నారు. స్వరూప్‌దాస్ వెండిపాలిష్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన భార్య వైశాకీదాస్, కూతురు నిషితాదాస్ సాయంత్రం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వయోధికుల సామాజిక స్ఫూర్తి ఎందరికో ఆదర్శం


వ్యవస్థాపకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, నవంబర్ 28: వయోధికుల సామాజిక స్ఫూర్తి ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. 2008లో స్థాపించిన ఎస్ఆర్‌నగర్ వయోధకుల మండలి అంచెలంచెలుగా తన కార్యకలాపాలను విస్తరిస్తూ, 10 మంది సభ్యులతో ప్రారంభమై 104 మంది సభ్యులను కలిగి ఉండడం అభినందనీయమన్నారు. మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీపీ దూబే, కృష్ణదేవ్‌గౌడ్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరించిన బలరామ కృష్ణమూర్తి సహా అప్పటి సభ్యులైన రాములు, డీవీఎస్ అవధాని, సుభాష్ చంద్రబోస్, నారాయణరెడ్డి సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి పాటు వయోధిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ముఖేష్ కుమార్‌ను సత్కరిస్తున్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, నవంబర్ 28: విద్యార్థులు మంచి ప్రతిభతో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. అడ్డగుట్టకు చెందిన పెండెం మనోహర్, భవాని దంపతుల కుమారుడు ముఖేష్ కుమార్ ఏపీ నుంచి జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను గురువారం కార్పొరేటర్ నివాసంలో శాలువాతో ఘనంగా సత్కారించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, మనోహర్ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

అన్న ప్రసాద వితరణలో ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

చిక్కడపల్లి, నవంబర్ 28: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శంకర్ గురు స్వామి ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో సాయిబాబా దేవాలయం వద్ద 41వ రోజుల పాటు స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై స్వాములకు అన్నప్రాసద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైందని అన్నారు. స్వాములకు 41 రోజుల పాటు అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్న శంకర్ గురు స్వామిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి నవీన్‌నాయుడు, జి.నరేశ్‌నాయుడు, బీఆర్ఎస్ నాయకుడు టెంపుల్ జనార్దన్ పాల్గొన్నారు.

**బేగంపేట్:** ఆధ్మాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని గైదిన్‌బాగ్‌లో పునర్నిర్మించిన వీరాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో నవగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. అలాగే జనరల్‌బజార్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా నిర్వహించిన అన్నకోటి పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

### లష్కర్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బేగంపేట్, నవంబర్ 28: విద్యుత్ లైన్లలో తలెత్తిన సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్ కారణంగా నేడు (శుక్రవారం) సికింద్రాబాద్ ప్యారడైజ్ ఏఈడీ పరిధిలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతు చేపడుతున్నట్టు ఎలక్ట్రిసిటీ అధికారులు తెలిపారు. చిలకలగూడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం విధిస్తున్నట్టు చెప్పారు. దండు పెంటయ్య ఫీడర్ పరిధిలోని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గరోండ త్రివేణి, గాంధీ మెడికల్ కాలేజ్ అండ్ బాయ్స్ హాస్టల్, హోమ్స్, సున్నతల్ జన్నత్ పాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారు. అలాగే బోయిగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వరకు క్రిష్ణనగర్ గార్డెన్స్, ఈఎస్ఐ, కల్పన టింబర్‌డిపో, బోయిగూడ, రాజీవ్‌గాంధీ విగ్రహం, ఐడీహెచ్ కాలనీ చర్చి, ఉప్పలమ్మ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్టు అధికారులు తెలిపారు.

**ఆజామాబాద్ డివిజన్‌లో..**

ముషీరాబాద్: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ అహోబిల మంతం, సాయిబాబా టెంపుల్, ఇందిరానగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా శుక్రవారం( నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు అహోబిల మఠం ఫీడర్ పరిధిలోని ఏటీఐ, లైఫ్ ఆసుపత్రి, ఆంధ్రాబ్యాంక్, సాయిబాబా టెంపుల్, హోటల్ మేనేజ్‌మెంట్ పరిసరాల్లో సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు సాయిబాబా టెంపుల్ ఫీడర్ పధిలోని శివం, సాయిబాబా టెంపుల్ కమాన్, ఆంధ్రాబ్యాంక్, వీహెచ్ లైన్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇందిరానగర్ ఫీడర్ పధిలోని క్రిష్ణారావు హాస్పిటల్, ఇందిరానగర్, తిలర్‌నగర్ బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

### తప్పిన ప్రమాదం

**బన్సీలాల్‌పేట్:** పద్మారావునగర్‌లోని హమాలీబస్తీలో గురువారం పురాతన చెట్టుకూలింది. అక్కడే ఉన్న విద్యుత్ స్తంభంపై పడటంతో అది విరిగి పక్కనే ఉన్న టిఫిన్‌సెంటర్ రేకులపై కూలింది. అదృష్టవశాత్తు టిఫిన్ సెంటర్ మూసి ఉండటంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. జీహెచ్ఎంసీ అధికారులు అక్కడకు చేరుకొని చెట్ల కొమ్మలను తొలగించారు. బన్సీలాల్‌పేట్

## దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గ్రేటర్ అధ్యక్షుడు ఆలకుంట హరి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 28: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రధాన కారణంగా నిలిచిన కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన రోజైన నవంబర్ 29ని దీక్షా దివస్‌గా ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ యువజన విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆలకుంట హరి పిలుపునిచ్చారు. తార్నాకలోని పింక్ పర్ల్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. హరి మాట్లాడుతూ తార్నాక డివిజన్ నుంచి 300 బైక్‌లతో ఇప్లూ నుంచి ర్యాలీ ప్రారంభమై చిలకలగూడ మున్సిపల్ గ్రౌండ్‌లో స్థానిక ఎమ్మెల్యే పద్మారావుతో కలిసి అక్కడి నుంచి తెలంగాణ భవన్‌కు బయల్దేరనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, యువజన, మహిళా, మైనారిటీ విభాగాల నేతలు పాల్గొన్నారు.

### ఘంటసాల చిరస్మరణీయుడు

ముషీరాబాద్, నవంబర్ 28: ఘంటసాల చిరస్మరణీయుడని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రిస్ట్బ(ఇండియా)నిర్వహణలో విఖ్యాత గాయకుడు ఘంటసాల భగవత్ గీత గానం చేసి 50ఏండ్లు పూర్తైన సందర్భంగా భగవత్ గీతా స్వర్ణోత్సవం నిర్వహించారు. వోలేటి పార్వతీశం పాల్గొని గాయకులను సత్కరించారు. బాలకామేశ్వరరావు, ఫణి, సురేశ్, హృషికేష్ అలపించిన ఘంటసాల గీతాలు శ్రోతలను రంజిపజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వంశీ రామరాజు, సుంకరపల్లి శైజల, డాక్టర్ తెన్నేటి సుధ తదితరులు పాల్గొన్నారు.

### తృటిలో తప్పిన సైబర్ మోసం

బొల్లారం, నవంబర్ 28: లోతుకుంట ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారుడైన ఓ వైద్యుడి అకౌంట్ నుంచి డెబిట్ అయిన డబ్బులను చాకచక్యంతో కాపాడిన సంఘటన గురువారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ వైద్యుడు గురువారం తన అకౌంట్‌లో నగదు జమ చేసుకున్నాడు. అయితే గుర్తుతెలియని వ్యక్తి సదరు వైద్యుడికి ఫోన్‌చేసి తాము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం. కేవైసీ చేయాలని ఫోన్ చేసి ఓటీపీ నంబర్ చెప్పాలని అడిగాడు. వైద్యుడు ఓటీపీ నంబర్ చెప్పిన వెంటనే రూ.30లక్షలు తన అకౌంట్ నుంచి డెబిట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. మోసపోయానని వెంటనే తేరుకున్న బాధితుడు హుటాహుటిన బ్యాంకుకు వెళ్లి మేనేజర్ నవీన్‌ను కలిసి జరిగిన విషయాన్ని వివరించాడు. మేనేజర్ సూచన మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ నాగరాజు సైబర్ పోర్టల్‌కు ఫోన్ చేయడంతో అకౌంట్‌ను బ్లాక్ చేశారు. దీంతో డబ్బులు సేఫ్‌గా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. దీంతో తృటిలో సైబర్ మోసం నుంచి బయటపడినట్లైంది.

## సామాజిక విప్లవకారుడు మహాత్మా ఫూలే

అడిక్‌మెట్‌లో నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

నృత్య రూపకంలో కళాకారులు

ఓయూలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ముషీరాబాద్, నవంబర్ 28: పేద, బలహీన వర్గాలకు విద్య నందించి సరికొత్త సమాజిక విప్లవానికి శ్రీకారం చుట్టిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అడిక్‌మెట్ జామైఉస్మానియా ఫ్లైఓవర్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి ఘనంగా వివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగువర్గాల అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసి సమాజానికి మార్గదర్శకులయ్యారని కొనియాడారు. బీఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్, నేత శ్రీనివాస్, శ్యామ్‌సుందర్, సిరిగిరి శ్యామ్, సత్యనారాయణ, రోహిత్‌కుమార్, అస్లాం, టక్కర్, ప్రభాకర్‌చారి పాల్గొన్నారు.

**గొప్ప సంఘ సంస్కర్త..**

చిక్కడపల్లి: జ్ఞాన చైతన్యం అందజేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పోతగాని ఐలయ్యగౌడ్ పాల్గొన్నారు.

**పూలే అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేయాలి**

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఓయూలోని అంబేద్కర్ రీసర్చ్ సెంటర్ ఆవరణలోని పూలే విగ్రహానికి అంజలి ఘటించారు. పూలే అధ్యయన కేంద్రాన్ని ప్రతి వర్సిటీలో నెలకొల్పి విద్యార్థుల్ని చైతన్యం చేయాలని డిమాండ్ చేశారు.